జియాగూడ 2 బీహెచ్‌కే కాలనీలో భద్రత కరువు

- పోకిరీలకు అడ్డాగా మారిన వైనం
- భయాందోళనలో కాలనీ వాసులు
- నిఘా పెంచాలంటున్న స్థానికులు



జియాగూడ: భద్రత కరువైన జియాగూడ 2 బీహెచ్‌కే కాలనీలో సంఘ విద్రోహుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. గతంలో మాదిరిగానే నేరాలు జరుగుతున్నాయని పలువురు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబుల్‌బెడ్‌రూమ్‌ల నిర్మాణానికి ముందు ఎంసీహెచ్ క్వార్టర్స్ ఉండేది. అప్పట్లో ఎన్నో గొడవలు, హత్యలు జరిగాయి. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లలో నేరాలు మళ్లీ చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల డబుల్‌బెడ్‌రూమ్‌ల పరిధిలో రెండు దారుణ హత్యలు జరిగాయి. దీంతో డబుల్‌బెడ్‌రూమ్‌ల కాలనీకి ఏమాత్రం భద్రత లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబుల్‌బెడ్‌రూమ్‌ల టెర్రస్‌పై తాగుబోతుల ఆగడాలు..

డబుల్‌బెడ్‌రూమ్‌ల నిర్మాణం జరిగినప్పుడు మొత్తం 880 డబుల్‌బెడ్‌రూమ్‌లు నిర్మించారు. అందులో 5 ఫ్లోర్‌లు కాగా మూడు ఫ్లోర్‌లు మొత్తం గతంలో ఉన్న కాలనీవాసులకు ఇవ్వడం జరిగింది. మిగతా 220 ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం వీటిని భర్తీ చేయలేదు. రాత్రివేళల్లో కొందరు ఆకతాయిలు, తాగుబోతులు, సంఘ విద్రోహులు వేసిన తాళాలను పగలగొట్టి, లేదా నకిలీ తాళాల ద్వారా టెర్రస్ డోర్‌లను తెరిచి మద్యం సేవించి నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల టెర్రస్‌పై ఓ యువకుడిని హింసించి దారుణ హత్య చేశారు.

ఔట్‌పోస్టు లేక ఇబ్బందులు..

డబుల్‌బెడ్‌రూమ్ నిర్మించే సమయంలో ఆర్డర్ కాపీ ప్రకారం డబుల్‌బెడ్‌రూమ్ చుట్టూ ప్రహరీ, మూడు గేట్లు, వాచ్‌మెన్, రెండు గార్డెన్‌లు, స్కూల్ భవన నిర్మాణం తదితర వాటిని చేపట్టాల్సి ఉండేది. కానీ కేవలం డబుల్‌బెడ్‌రూమ్ నిర్మించి కాలనీవాసులకు అప్పగించారు. ఏ మాత్రం భద్రత లేక నేరాలు జరుగుతున్నాయి. ఔట్‌పోస్ట్ నిర్మాణం చేయాలని కాలనీవాసులు పలుమార్లు సంబంధిత విభాగాలకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఔట్‌పోస్ట్ ఏర్పాటు కాలేదు. సుమారు ఐదువేలకు పైగా జనాభా ఉన్న ఈ డబుల్‌బెడ్‌రూమ్‌లలో గొడవలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఔట్‌పోస్ట్ ఉన్నట్లు అయితే పోలీసులు సిబ్బంది అక్కడికక్కడే సమస్యను పరిష్కరించడంతో పాటు కాలనీకి కూడా భద్రత ఉంటుందని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మొరపెట్టుకుంటున్నారు.

క్లుప్తంగా...

నేడు సాలార్‌జంగ్ మ్యూజియంలో 'మన్ కీ బాత్'

చార్మినార్: సాలార్‌జంగ్ మ్యూజియంలోని వెస్ట్రన్ బ్లాక్‌లో ఆదివారం (ఈ నెల 30న) ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకుడు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. మ్యూజియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ఉదయం 10.30 గంటలకు నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారన్నారు. ప్రపంచ ప్రఖ్యాత కార్యక్రమం మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ కోసం కోట్లాది మంది భారతీయులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



గోషామహల్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

అబిడ్స్: ప్రజా సమస్యలను పలు శాఖల అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ పేర్కొన్నారు. గోషామహల్ డివిజన్‌లో పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, ఇతర శాఖల అధికారులు ప్రతి రోజు పర్యటించి ప్రాంతాల వారీగా సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేస్తాం



మాట్లాడుతున్న బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నామని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. మన శక్తి పార్టీ అధ్యక్షుడు శ్రీనాథ కృష్ణ, న్యూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు నర్సయ్యతో పాటు ఇతర పార్టీ నాయకులతో సమావేశం అవుతున్నామని, త్వరలోనే తమ ఎజెండాను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాధాకృష్ణ, ధర్మేంద్ర తివారి, అభిజిత్‌యాదవ్ పాల్గొన్నారు.

మేడే రోజు మున్సిపల్ కార్మికులకు సెలవు ఇవ్వాలి

గోల్కొండ: మే డే రోజు మున్సిపల్ కార్మికులకు సెలవు ఇవ్వాలని సీఐటీయూ జీహెచ్‌ఎంసీ, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి మల్లేష్ అన్నారు. శనివారం ఆయన జోనల్ కమిషనర్ రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతి ఏటా వేసవిలో మున్సిపల్ కార్మికులకు ఏప్రిల్, మే నెలల్లో ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పని ఇచ్చేవారని, అయితే ఈ సంవత్సరం కార్మికులకు ఇప్పటి వరకు వేసవి సమయాన్ని అమలు చేయడం లేదన్నారు.

అదృశ్యమైన వ్యక్తి హత్య

అఫ్జల్‌గంజ్: అదృశ్యమైన వ్యక్తి హత్యకు గురైన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. హతుడి తండ్రి ఫిర్యాదుతో అదృశ్యం కేసు హత్యగా మార్చి ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లాకు చెందిన గజానంద్ (35) కుమారుడు, భార్య ఊర్మిళతో కలిసి గత ఏడాది నవంబర్ 24న స్వగ్రామనాకి వెళ్లేందుకు ఎంజీబీఎస్‌కు చేరుకున్నారు. భర్త తనతో గొడవపడి వెళ్లిపోయాడని ఊర్మిళ గజానంద్ తండ్రి శివాజీకి ఫోన్ ద్వారా సమాచారం అందించింది. గజానంద్ తండ్రి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో తన కుమారుడు తప్పిపోయినట్లుగా ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అతని ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేక బృందాలు నియమించి కోనసీమ, అమలాపురం తదితర జిల్లాలకు పంపించినా ఫలితం లేకుండా గత కొంతకాలంగా గజానంద్ భార్య ఊర్మిల సాధారణ ఫోన్ కాల్స్ కాకుండా కేవలం వాట్సాప్ కాల్స్ మాత్రమే మాట్లాడుతుండడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసులు చేపట్టిన దర్యాప్తులో గతంలో గజానంద్ పనిచేసే యజమాని రవిశంకర్ రాయుడుతో ఊర్మిళకు వివాహేతర సంబంధం ఉందని గుర్తించారు. పథకం ప్రకారం.. ఊర్మిళ, రవిశంకర్ రాయుడులు కలిసి గజానంద్‌ను జి–అగ్రహారంలోని ఓ షెడ్డులోకి తీసుకెళ్లి ఇనుప రాడ్డుతో కొట్టి హత్య చేశారు. శవాన్ని పూర్తిగా తగలబెట్టారు. ఎముకలను సైతం బూడిదిగా చేసి ఓ సంచిలో వేసి పాతి పెట్టారు. ఈ మేరకు అదృశ్యం కేసును హత్యగా మార్చి ఆంధ్రప్రదేశ్‌లోని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీఆర్‌ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం



హోంమంత్రి మహమూద్ అలీని సత్కరించిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. తెలంగాణలో 125 అడుగుల భారీ ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం, రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేర్లు నామకరణం చేయడం సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం, దళితుల ప్రగతి కోసం దేశంలోనే ముందుందన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ మంత్రి మహమూద్‌అలీని ఘనంగా సత్కరించారు. పలు సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ పార్టీ ముందుంటుందన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు.

ముగిసిన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు



ముగింపు వేడుకల్లో ప్రసంగిస్తున్న ఆచార్య తంగెడ కిషన్‌రావు

నాంపల్లి: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ముగిశాయి. నాలుగు రోజుల పాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు వర్సిటీ ప్రధాన ప్రాంగణంలో జరిగాయి. శనివారం ఎన్టీఆర్ కళా మందిరంలో ఉపాధ్యక్షుడు తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ డీజీపీ హెచ్‌జె.దొర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి ఆయనతో ఉన్న అనుబంధాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్‌ను గుర్తుంచుకుని శత జయంతి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆయన స్ఫూర్తి తెలుగు వర్సిటీలో కనిపిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఎన్టీఆర్ నిస్వార్థ బుద్ధితో ప్రజలకు సేవలను అందించాలనే ఉద్దేశంతో సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు.. అని నినదించి రాజకీయ ఆరంగేట్రం చేసి అఖండ విజయాన్ని సాధించిన రాజకీయ ధీశాలి అని గుర్తుచేశారు. ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయానికి 11వ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ మహానటుడు ఎన్టీర్ శత జయంతిని నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మేరు కులస్తుల సంక్షేమానికి ప్రత్యేక కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తామని రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. మేరు కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా తమ జేఏసీ ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందన్నారు. శనివారం జరిగిన మేరు కులస్తుల జేఏసీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీసీ–డీలో ఉన్న మేరు కులస్తులను బీసీ–ఏ గ్రూప్‌లోకి మార్చే విధంగా త్వరలోనే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలలో మేరు కులస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి టికెట్లు ఎక్కువగా కేటాయించే విధంగా అన్ని పార్టీల అధ్యక్షులకు వినతిపత్రాలు అందజేస్తామని పోల్కం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరు కులస్తుల జేఏసీ నాయకులు ఎంపటి పాండు, లింబాద్రి, శ్రీనివాస్, గొట్టి నరేందర్ పాల్గొన్నారు.

సామ జగన్మోహన్ రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కోఠి జిల్లా కన్వీనర్ సభావట్ కల్యాణ్, కళాశాల అధ్యక్షుడు దిలీప్ తదితరులు

చార్మినార్: సిటీ కళాశాలలో శనివారం సామ జగన్మోహన్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఠి జిల్లా కన్వీనర్ సభావట్ కల్యాణ్, కళాశాల అధ్యక్షుడు దిలీప్ మాట్లాడుతూ.. జాతీయ జెండాకు అవమానం జరగకూడదని.. తన ప్రాణాల కంటే జాతీయ గౌరవం ముఖ్యమని.. గొప్పదని జాతి వ్యతిరేక శక్తులతో పోరాడి నరహంతక ఆర్‌ఎస్‌యూ గుండాల చేతిలో అత్యంత దారుణ హత్యకు గురై జాతీయ జెండా కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన షాహిద్ సామ జగనన్న వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని తలుస్తూ వారికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సృజన్, ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్ రాహుల్, టౌన్ సంయుక్త కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు శివగౌడ్, విద్యార్థి కార్యకర్తలు విగ్నేశ్, చందు, కవిత, దివ్య, మౌన, రిషిత, రాహుల్, యశ్వంత్, అభిషేక్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కౌసర్ కూతురి పెళ్లి వేడుకలు

గోల్కొండ: ఎమ్మెల్యే కౌసర్ కూతురి పెళ్లి ఘనంగా జరిగింది. గుడిమల్కాపూర్‌లోని కోహినూర్ క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన ఈ పెళ్లి వేడుకలకు హోంమంత్రి మహమూద్ అలీ, మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పెళ్లికి హాజరయ్యారు. వారు ఎమ్మెల్యే కౌసర్‌తోపాటు వరుడు ముస్తాక్ అహ్మద్ బేగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మజ్లిస్ శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, మజ్లిస్ ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఆజం ఖాన్, అహ్మద్ బలాలా తదితరులున్నారు.



పెళ్లి వేడుకల్లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



వరుడితో హోంమంత్రి మహమూద్ అలీ

'బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలి'



అలీ బిన్ ఇబ్రహీం మస్కతీ

చార్మినార్: కళాసిగూడలో మ్యాన్‌హోల్‌లో మౌనిక అనే బాలిక పడిపోయి మృతి చెందడం పట్ల మస్కతీ డైరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అలీ బిన్ ఇబ్రహీం మస్కతీ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి మృతి చెందిన ఘటనకు సంబంధింత అధికారులు, సిబ్బందిని ప్రధాన బాధ్యులుగా భావించి వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలున్నాయా..? లేవా అనే విషయాలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు జరగవన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్, కాంటినెంజెంటి వర్కర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ విమర్శించారు. ఈ మేరకు శనివారం కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్‌లో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో జీఓ నంబర్ 510 విడుదలైన సందర్భంగా కొద్ది మందిపై క్యాటగిరిల వారీగా మాత్రమే జీతాలు పెంచి కింది కేటగిరిల వారిని విస్మరించారన్నారు. నాటి నుంచి నేటి వరకు వారికి జీతాలు పెంచకుండా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. జీఓ నెంబర్ 60 ప్రకారం.. బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు రూ.15,600 రావాల్సి ఉన్నప్పటికీ రూ.10 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కన్న, కార్మికులు మురళీ కృష్ణ, బాలసుబ్రమణ్యం, సుమన్, సుజాత, రాములమ్మ, గౌస్ పాషా, విజయ్‌నాయక్, కౌసల్య పాల్గొన్నారు.

మంచి కవిత్వానికి ఎల్లవేళలా గుర్తింపు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నందిని సిద్ధారెడ్డి

గన్‌ఫౌండ్రీ: మంచి కవిత్వానికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిద్ధారెడ్డి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కవన కిరణాలు తెలుగు సాహితీ సమాఖ్య నాల్గవ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. అదేవిధంగా నేటి నిజం పత్రిక సంపాదకులు బైసా దేవదాస్, ముంబాయ్ ఆంధ్ర మహాసభ మాజీ చైర్మన్ పోతు రాజారామ్‌లకు సాహిత్య సామాజిక విశిష్ట సేవారత్న జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవానంద్, సినీ రచయిత మౌనశ్రీ మల్లిక్, టీవీ నటుడు సాహిత్య ప్రకాష్, రచయిత్రి పద్మావతి, సమాఖ్య అధ్యక్షులు మంచాల శివ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల

డబీర్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారంలో మజ్లిస్ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల అన్నారు. డబీర్‌పురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన శనివారం జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్‌లోని రాజానర్సింహానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ శిథిలావస్థకు చేరుకున్న పురాతన కమ్యూనిటీ హాల్ స్థానంలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. మతాలకతీతంగా పలు అభివృద్ధి నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నక్కా రాజేశ్, జలమండలి అధికారి మహేశ్, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ప్రధాన రోడ్లపై కొనసాగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం నియోజకవర్గం పరిధిలోని యాకుత్‌పురా, రెయిన్‌బజార్, ఎస్‌ఆర్టీ కాలనీ, బడాబజార్, జఫర్ రోడ్డు ప్రాంతాల్లో కొనసాగుతున్న తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్, రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడాబజార్ జఫర్ రోడ్డులో తాగునీటి నిర్మాణ పనులు చేపట్టనున్నామన్నారు. డబీర్‌పురా నాగాబౌళి నుంచి యాకుత్‌పురా రైల్వేస్టేషన్ వరకు రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులకు చెప్పామన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అమోఘం



రాకేష్‌కుమార్ సింగ్‌ను సన్మానిస్తున్న ఆకుల రవీందర్‌రావు తదితరులు

జియాగూడ: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్‌కు పూర్తి సహకారాన్ని అందిస్తానని నూతనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ సలహాదారులుగా నియమితులైన జాతీయ మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్ కంట్రోలర్ జాయింట్ సెక్రెటరీ రాకేష్ కుమార్ సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన చాంబర్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ కార్యదర్శి లయన్ ఆకుల రవీందర్‌రావు, ఉపాధ్యక్షులు లయన్ కొండూరి, పీఆర్‌ఓ జే.ఆనంద్‌కుమార్ వెళ్లి సన్మానించి సత్కరించారు. అనంతరం ఉపాధ్యక్షుడు లయన్ ఆకుల రవీందర్‌రావు మాట్లాడుతూ.. నూతన సలహాదారులుగా నియమితులైన రాకేష్ కుమార్ సింగ్ సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి వారికి బాధ్యతలను అప్పగించామన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్స్ ద్వారా నిరుపేదలకు అందించే విద్య, వైద్య ఉపాధి కార్యక్రమాలకు రాకేష్‌కుమార్ సింగ్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తారన్నారు.

ఎంజే మార్కెట్‌లో 'స్వచ్ఛ్ కేర్'



స్వచ్ఛ్ కేర్‌లో పాల్గొన్న డాక్టర్ సయ్యద్ కమ్రాన్ హుస్సేన్ తదితరులు

అబిడ్స్: ఎంజే మార్కెట్‌లో కేర్ ఆస్పత్రి వారు స్వచ్ఛ్ కేర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ట్రాఫిక్ పోలీసులతో కలిసి శనివారం ఎంజే మార్కెట్ చౌరస్తా వద్ద కేర్ ఆస్పత్రి హెచ్‌సీఓఓ సయ్యద్ కమ్రాన్ హుస్సేన్ ప్రారంభించి ప్రసంగించారు. స్థానికంగా పరిశుభ్రత చేయడమే, స్థానిక ప్రజలకు పరిశుభ్రంపై అవగాహన కలిపించడమే స్వచ్ఛకేర్ ముఖ్యోద్దేశమని తెలిపారు. ప్రాంతాల్లో పరిశుభ్రత చేసి మొక్కలు నాటి వాటిని పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల కోసం తరచు అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

చలో భారత్ జీతో భాగ్యనగర్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: కొన్నేళ్లుగా ప్రపంచ వివిధ క్రీడా వేదికలపై భారత క్రీడాకారులు అద్భుతంగా రాణిస్తున్నారని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ టి. అమర్‌సింగ్ అన్నారు. శనివారం ఆయన గుడిమల్కాపూర్‌లో చలో భారత్ జీతో భాగ్యనగర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంటరీ స్థాయిలో ఈ క్రీడా పండగను భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. యువ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించి వారిలో ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీయడం కోసమే ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. బాక్సింగ్, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు విశ్వవేదికపై రాణిస్తూ తెలంగాణకే గర్వకారణంగా నిలుస్తున్నారన్నారు. బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు జి. సునీల్‌యాదవ్, జొన్నకుంటి మధుసూదన్, బీజేపీ, బీజేవైఎం నాయకులు తదితరులున్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌లను స్థానికులకే కేటాయించాలి



హోంమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

జియాగూడ: జియాగూడలో డబుల్ బెడ్‌రూమ్‌లలో మిగిలి ఉన్న ఫ్లాట్లను స్థానికులకే కేటాయించాలని జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన హోంమంత్రి మహమూద్ అలీని కలిసి రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు జియాగూడలో అదనంగా ఉన్న 220 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ల గురించి వివరించారు. స్థానికంగా సుమారు 18 దళితవాడలు నెలకొని ఉన్నాయని, వారికి ఇప్పటికి సొంత ఇల్లు కూడా లేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్‌ల ఖాళీల్లో మిగిలి ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికే డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించాలని కోరారు.

ఖాజా బాసీత్ షరీఫ్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

సుల్తాన్‌బజార్: ప్రశాంత భాగ్యనగరంలో మత విద్వేశాలు రెచ్చగొడుతున్న ఖాజా బాసీత్ షరీఫ్ అనే వ్యక్తి ఉగ్రవాదిలా వ్యవహరిస్తూ హిందూ ముస్లింల మధ్య వివాదాలు సృష్టించేలా మాట్లాడుతున్న అతనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్, ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి వీరేష్, భరత్‌వంశీ మాట్లాడారు. భాగ్యనగరంలో మల్లేపల్లికి చెందిన ఖాజా బాసీత్ షరీఫ్ అనే వ్యక్తి హిందూ ముస్లింల మధ్య వివాదాలు సృష్టించేలా మాట్లాడడం వీడియోలు క్రియేట్ చేయడంతో పాటు రెచ్చగొట్టే కార్యకలాపాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ విషయాలను ఓ విలేకరి బయటపెట్టడంతో పోలీసులు విలేకరిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు.